# శయనేషు రంభ

**— సుధారమ**

ఎప్పటికన్నా ఉత్సాహంతో రాగానే సన్నటి ఈల వేస్తూ నేరుగా వంటింట్లోకి ప్రవేశించాడు మధుమూర్తి. పిల్లలు ప్రణయ్, శ్వేత కాలనీలో పిల్లలతో కలిసి ఆటల్లో మునిగి ఉన్నారు. మధుమూర్తి తల్లి రాజ్యలక్ష్మి టేప్‌రికార్డరులో ఘంటసాల పాత పాటలు వింటూ వడక కుర్చీలో కూర్చునుంది. అతడి భార్య హేమ సింకులో పాత్రలు తోముతూ నాలుగో తరగతి చదువుతున్న ప్రణయ్‌కి, సీనియర్ కె.జి. చదువుతున్న శ్వేతకీ ఆరోజు చేయించాల్సిన హెూమ్‌వర్క్, పాఠాలూ గురించి ఆలోచిస్తూంది. మధుమూర్తి ఆధాటుగా వెళ్ళి హేమని వెనకనుంచి కౌగిలించుకున్నాడు. అతడి చిలిపితనం ఆమెలో పులకింతలు రేపింది. అయినా గాంభీర్యం నటిస్తూ— 'ఏమిటో మీ పనులు - కొత్తగా పెళ్ళయిందనుకున్నారా' అంది. 'అబ్బ! హేమా, ఎప్పుడూ కొత్తగా పెళ్ళయినట్టే ఉండాలి తెల్సా. ఈమధ్య నీవన్నలు నేనంటే శ్రద్ధ చూపించగం లేదు. ఎప్పుడూ పిల్లలూ, పనీ, నిద్రానూ. అందుకే ఈమధ్య మార్కెట్లో కొచ్చిన నవల తెచ్చాను. ముఖ్యంగా నీవిది చదివి తీరాలి. ఈ పుస్తకం చదివాకే తెల్సింది మనం ఎంత మధురమైన అనుభవాల్ని మిస్సవుతున్నామని'—

హేమ మనను చివుక్కుమంది. తనలో ఏదో లోపం ఉందని భర్త అన్యాపదేశంగా అంటూండడం ఆమె గమనిస్తూంది. అతడిలో వచ్చిన ఈ మార్పు ఆమెకి కొంత అర్థమవుతూంది. నలభయ్యో పడిలో అడుగు పెడ్తున్న అతడిలో ఈ మార్పు సహజం కావచ్చు. కానీ అతడిలోని ఈ వికారానికి కారణం ఆమె అన్వేషిస్తూంది. అతడీ మధ్య పత్రికల్లో వస్తున్న కొన్ని చవకబారు శృంగారపరమైన కథల్నీ నవలల్నీ బాగా ఇష్టంగా చదువుతున్నాడు. సినిమాల్లో రెండర్థాల పాటల్నీ సంభాషణల్నీ ఎంజాయ్ చేస్తున్నాడు. అప్పుడప్పుడు పరాయి ఆడవాళ్ళ అందాల్నీ కూడా హేమ దగ్గర ప్రస్తావించడం జరుగుతూంది.

హేమ ఇలాంటి మాటల్ని పట్టించుకోనట్లే నటిస్తుంది. హేమకి రోజంతా మధుమూర్తిలో వచ్చిన మార్పుని గురించి ఆలోచించడానికే సమయం చాలదు. ఓ స్కూల్లో టీచరుగా పనిచేస్తూ, ఇల్లాలి బాధ్యతల్ని నెరవేర్చే హేమ బుర్ర చిన్న కంప్యూటర్లా మల్టీప్రోగ్రామింగ్ జరుపుతూ అత్యంత వేగంగా పనులు చేస్తూండ బట్టి సంసారం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లా సాగిపోతూంది. టిఫినూ, వంట, అంట్లూ లాంటి రోటీన్ పనులని చేస్తూ ఆమె పిల్లల చదువులూ, ఇంటి ఖర్చులూ, వెచ్చాలూ, స్కూల్లో చెప్పాల్సిన పాఠాలూ మొదలైన వాటి గురించి ఆలోచిస్తూ ఉంటుంది. అత్తగారు రాజ్యలక్ష్మి ఆరోగ్యం బావుం డినన్నాళ్ళూ ఆమెకి కొంత సహాయం ఉండేది. ఇప్పుడు పక్షవాతం వాతనబడి కోలుకుంటున్న ఆమెని జాగ్రత్తగా చూసుకోవడం,కూడా ముఖ్యమైన పనయింది హేమకు.

పిల్లలు మొదటి ర్యాంకుల్లో రావడమే కాకుండా వారిని మరింత మేధావంతుల్ని చెయ్యాలి. ఓ చిన్న ఇల్లు కట్టుకోవాలి. తమ కోసం ఇన్నాళ్ళూ కష్టపడ్డ అత్తగారిని వీలైనంతవరకూ సుఖపెట్టాలి. స్కూల్లో బాగా పాఠాలు చెప్తూ, 'మంచి టీచర'న్న పేరుని నిలబెట్టుకోవాలి. ఇవన్నీ హేమ చిన్న చిన్న ఆశలు..వీటి కోసం ఆమె ఆనందంగా శ్రమపడుతుంది, కష్టపడడంలోనూ ఇష్టంగా—

మధుమూర్తి కంప్యూటరున్న ఆఫీసరులా చిద్విలాసంగా ఉంటాడు. (ప్రోగ్రామింగ్ కూడా చెయ్యక్కర్లేదతను) ఆఫీసుకు వెళ్ళేలోపు భోజనం సిద్ధంగా ఉంటుంది. ఇంటికి వచ్చేసరికి హేమ నాలుగుకే వస్తుంది కనుక ఫలహారం, కాఫీ రెడీగా ఉంటాయి. ఆమె చెప్పే ఏదైనా బజారు పని చేస్తాడు. ఆ ఊరు మరీ పెద్దది కాదు. అలాగని కుగ్రామమూ కాదు. కాలవగట్టు మీద షికారు కెళ్ళొచ్చు. కారమ్సు ఆడు



కోవచ్చు. టి.వి. ఉండనే ఉందిక. హేమ, 'మా వారు మంచి వారు. మా అత్తగారికి ఆఫీసుకి వెళ్ళేముందు అన్నం వడ్డించి, వెళ్తారు. పిల్లల్ని స్కూల్లో వదుల్తారు ....'' అంటూ చెప్పుకుంటూవుంటుంది. సెలవు రోజుల్లో అందరూ ఏటేనా షికారుకో, సినిమాకో వెళ్తారు. ఆదివారాల్లోనూ, సెలవు రోజుల్లోనూ హేమా, మధుమూర్తి అందమైన వలపు పందిరి కింద అనిర్వచనీయమైన మధురానుభూతుల్ని పొందుతారు.

ఇంత అందమైన సంసారంలో - ఇంతటి ఇల్లాలైన తనని పెళ్ళైన పదకొండేళ్ళకి - 'ఫ్రిజిడిటీ' అన్న లేని లోపం అంటగట్టి. ఇలా ఉసురుపోసుకోవడం ఏం సబబు?

ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి. అయినా ఆమె ఆ నవలని శ్రద్ధగా చదివింది. చదివాక ఆమెకి చలం ఇందులో ముప్పాతిక భాగం ముందే చెప్పేసాడనిపించింది. అయినా ఆమె మధుమూర్తి కోణంలో ఆలోచించాలనుకుంది. అతడికి చెడ్డ అలవాట్లు లేవ్స. సలభయ్యో పడి వడివడిగా వస్తూంటే జీవితాన్ని గొప్పగా అనుభవించలేదన్న వెలితితో అతడు బాధపడుతున్నాడు. ఆ సమయంలో అతడు కూడా చిన్న పిల్లాడిలా అన్పించాడు హేమకి. ఓ ఆరునెల్ల నుంచి అత్తగారి అనారోగ్యం వగైరా ఇబ్బందుల వల్ల తను అంతగా 'ఇష్టం' చూపించడం లేదు.

అతడు చదువుతున్న సాహిత్యం (?)లో అన్ని సమస్యలకీ, బాధలకీ సెక్సు కారణం. హాయిగా శృంగార జీవితం గడవడమే అన్ని సమస్యలకీ పరిష్కారం అని వుంటుంది. కానీ అక్రమ సంబంధాల్ని చవులూరించేలా వర్ణించి చివరకు అవి ముప్పు తెస్తాయనీ అవి తప్పనీ ఓ నీతి వాక్యం చేర్చిన కథలు - ఒంట్లో నరనరాల్లో వేడిని రగిలించి, 'యౌవని' పుట్టించి లేని మానసిక రుగ్మతల్ని రేపే ఈ కథలు...అయినా అతడు తన సహకారం కోరుతున్నాడు కానీ వేరే ఆడవాళ్ళ కోసం వెళ్ళడం లేదు. భార్యగా - 'శయనేషు రంభా' అన్న కర్తవ్యాన్ని నిర్వర్తించడానికి పూనుకుంది హేమ.

పరిమితంగా దొరికే సుకుమారమైన, సున్నితమైన మధురానుభవాలు బళ్ళకొద్దీ మల్లెల వాన కురిసినట్లు రోజూ దొరుకుతున్నాయి. తన మీద 'ఫ్రిజిడిటీ' అని అతడు చేసిన ఆరోపణని ఛాలెంజిలా ఎదుర్కొంటున్న హేమ - శృంగార రసాధి దేవతని అతడికి ముందే తెలుసు. నాల్గు రోజుల నవ్యత్వం తర్వాత ఇద్దరిలో మానసికంగా, శారీరకంగా ఎన్నో మార్పులు ... బద్ధకం, బడలిక, పని మీద లోపించిన శ్రద్ధా... అనాసక్తి హేమకి తెల్లవారే లేవాలనిపించదు. కళ్ళెం లేని గుర్రంలా, గాడి తప్పిన రైలులా ఉంది కాపురం. పిల్లల మీద విసుగు - అత్తగారి చాదస్తపు మాటలకి చర్రున రేగే కోపం ... తనలో ఏదో లోపం....

ఆదివారం మధ్యాహ్నం పాపని పక్కన పడుకోబెట్టుకుని నిద్దరూవుతోంది హేమ. ప్రణయ్, పక్కింటి బుజ్జి ఆడుకుంటున్నారు హాల్లో. వాళ్ళ అల్లరి ఆగిపోయి నిశ్శబ్దంగా ఉండడంతో ఆమె కంప్యూటరు బుర్ర వెంటనే 'సమ్‌థింగ్ రాంగ్' అన్న మెసేజ్ పంపింది. చప్పుడు కాకుండా హాల్లోకి తొంగి చూసింది హేమ. అత్తగారు అటువేపు తిరిగి నిద్రపోతున్నారు. ప్రణయ్ ఏడేళ్ళ పాప బుజ్జితో ఆడుతున్న ఆట మొదట అర్థం కాలేదు అరసెకను ఆమెకి. అర్థమైనాక ఒళ్ళు జలదరించింది. దగ్గరగా పాపని హత్తుకుని వెనక ప్రాకులోంచి నిమురుతూ ముద్దు పెట్టుకుంటున్నాడు...తర్వాత ఏం చేస్తాడోనని ఆమె గుండె గుబగుబలాడింది. 'కాఫీ కలిపివ్వు' అన్నాడు వదిలేసి. 'థాంక్ గాడ్' వాళ్ళు 'అమ్మా నాన్నలాట' ఆడుతున్నారు. నిన్న మధ్యాహ్నం క్యాంపు నుంచి వచ్చి మధుమూర్తి ఇలాగే చేసాడు. తను తప్పించుకుని కాఫీ కలిపేందుకు వెళ్ళింది. తలుపు చప్పుడవడం గుర్తుంది.

పిల్లల 'విషయ గమనాసక్తినీ', 'గ్రహణ శక్తి'నీ పెంచాలని తను ప్రయత్నిస్తూ ఉంటుంది. వాళ్ళు తమనీ గమనిస్తుంటారు. పాప తన దగ్గరే పడుకుంటుంది. ముందు ప్రణయ్‌ని అవసరమైనప్పుడు మంచి మాటలతో బామ్మ దగ్గర పడుకోబెట్టేది. ఇప్పుడు రోజూ వాడు బామ్మ దగ్గరే పడుకుంటాడు. ఈ పది రోజుల్నించి పిల్లలకి మునుపట్లా కథలు చెప్పడం లేదు. వాళ్ళు చెప్పే కబుర్లు వినడం లేదు. మధుమూర్తి సరాగాలకీ, శృంగారానికీ పగలూ, రాత్రీ బేధం లేదు. ఈ నదికి ఆనకట్ట వేసే అవసరం ఉంది. ఆమె లేచి త్వరగా ఫలహారం తయారుచేసింది. ఇల్లు సర్ది అందరికీ ఫలహారాలిచ్చి పిల్లల్ని తయారు చేసి తనూ తయారయింది. 'అలా కోవెలకి వెళ్దాం పదండి' భర్తని బయల్దేరదీసింది.

గుడిలో ఎక్కువ జనం లేరు. అందరూ సినిమాలు చూస్తూ టి.వి.ల దగ్గర బిజీగా ఉండే సైమది. దైవ దర్శనం కానిచ్చి పొగడ చెట్టు కింద అరుగు మీద కూర్చున్నారు. ఎప్పట్లాగే పిల్లలు గుడి ముందున్న ఏనుగుల మీద ఆడుతున్నారు. కొబ్బరి ముక్కల ప్రసాదం అత్తగారికని జేబురుమాలులో కడుతూ అడిగింది హేమ— 'మనం చదివే శృంగార నవలల్లో, కథల్లో, ముసలి అమ్మలూ, నాన్నలూ, చిన్న పిల్లలూ ఉండరెందుకండీ?' — 'పానకంలో పుడకల్లా వాళ్ళెందుకు హేమా' నవ్వుతూ అన్నాడు మధు.

'అయితే మీకు మన పిల్లలు పానకంలో పుడకల్లా కన్పిస్తున్నారా'— పదునైన ఆమె ప్రశ్న అతన్ని ఆలోచనలో పడేసింది. మరో షాక్‌లా మధ్యాహ్నం పిల్లలాడుతున్న ఆటని గురించి చెప్పింది.

'ఎప్పుడూ మధురమైన అనుభవాలంటారు. ఈ పుస్తకాలు చదవక ముందు మనకు లేవా చెప్పండి? నక్షత్రాల కింద కాలువ గట్టున నడుస్తూ మీరు గబుక్కున ముద్దు పెట్టుకోవడం - నా తల్లో మల్లెలు తురుమడం— ఆషాఢ మాసంలో దొంగతనంగా కలుసుకోవడం - ఆ అల్లరీ ఈ పొగడ చెట్టు కింద కలబోసుకున్న కబుర్లూ - ఎన్నని చెప్పను? సున్నితమైన సుకుమారమైన ఆ భావాలు— ఈ చెత్త సాహిత్యం చదివితేనే వచ్చాయా చెప్పండి'' హేమ గొంతులో ఆవేశం అతడ్ని కదిలించింది. 'ఊరుకో హేమా ఇక ప్లీజ్' అంటున్నాడు.

'నన్ను చెప్పనీండి. కామం పురుషార్థాల్లో ఒక్కటి మాత్రమే. అందులోనూ దానికి మూడో స్థానం తప్ప మొదటి స్థానం లేదు. నిగ్రహం ఉన్నప్పుడే దానికి సార్థకత. నాకు నా సంసారం స్వర్గధామం కావాలి, మన్మథ సామ్రాజ్యం కాదు. ఈ అశ్లీల సినిమాలూ, సాహిత్యమూ, టెర్రరిజం, అవినీతికి దూరంగా పెంచి నా పిల్లల్ని గొప్పవాళ్ళనిగా, మన సంస్కృతికి విలువనిచ్చే వాళ్ళనిగా తయారు చేయాలనుకునే నా కలని మొగ్గల్లోనే తుంచలేను. ఇంట్లోనే ఇంత విశృంఖల శృంగారం వారి కంట బడడం .... మన తప్పు కాదా చెప్పండి? సహజంగా వాళ్ళు తెలుసుకోవాల్సినవి తెలుసుకోవడం మంచిదే. కానీ ... ఇలా కాదు. ఇక మీదరకు అస్తమానూ ఈ 'యావ' కాకుండా కాస్త మనస్సు మరల్చుకోవడానికి మంచి పుస్తకాలు చదవండి. హాబీలు ఏర్పరచుకోండి. నేచెప్పింది తప్పయితే సారీ'.

'మనమధ్య సారీలేమిటి హేమా. నీవు నాకూ మంచి టీచరువేగా!' పొగడపూలు ఏరుతూ మధుమూర్తి అన్నాడు. అతడి ముఖం స్వచ్ఛంగా ఉంది. హేమకి మనసు తేలికయింది. పిల్లలతో తిరిగి వెళ్తూంటే తిరిగీ తన స్వర్గంలోకి వెళ్తున్న భావన కలిగిందామెకి.

## అత్యాచార బాధితులకు హైదరాబాదులో ఉచిత కుటుంబ సలహా కేంద్రం

జీవితమనే సుడిగుండంలో మునిగిపోయి, సమస్యల విషవలయంలో చిక్కుకుని, మానసిక క్షోభకు గురి అయి బైట పడలేక ఆత్మహత్యే గత్యంతరం అనే నిర్ణయానికి వచ్చినవారు, కన్నవారికి నా అన్నవారికి దూరమైన వారు, దారి, తెన్నూ గమ్యం లేనివారు, నిరాధార, నిరాశా, నిస్పృహలతో నిస్తేజితులైన వారు, ముఖ్యంగా భర్తృ తిరస్కృతులు, పెళ్ళి కాని తల్లులు, అవమానితులు, ఇతరత్రా బాధితులు, ఇంకా రకరకాల చిత్ర హింసల పాలయిన స్త్రీలకై నిర్వహింపబడుతోంది ఈ కేంద్రం.

శ్రీమతి మల్లాది సుబ్బమ్మ ఆధ్వర్యంలో స్థాపింపబడి గత 10 ఏళ్ళుగా వికాస కేంద్రంలో నిర్వహింపబడుతున్నది. డా॥ ఎం. సౌభాగ్యవల్లి దీనికి అధ్యక్షురాలుగా శ్రీమతి రాధారమణయ్య కౌన్సిలర్‌గా వ్యవహరిస్తున్నారు.

స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలు అనంతం. ప్రేమించి మోసం చేసేవారు కొందరైతే, పెళ్ళాడి రెండో పెళ్లి చేసుకునేవారు మరికొందరు. భార్యలను తిట్టడం, కొట్టటం వెళ్ళగొట్టడం, చంపటం లాంటి దారుణాలెన్నో చేస్తున్నారు. అంతేకాక ఇంకా పిల్లలను లాక్కుని తల్లులను తరిమేసేవారు. పిల్లలతో సహా నెట్టేసేవాళ్ళు ఆమె ఆదాయాన్ని హరించేవాళ్ళు శీలాన్ని శంకించేవాళ్ళు ఇచ్చిన కట్నం చాలలేదని, అదనంగా లాంఛనాలు అందలేదని వేధించే వాళ్ళు మానభంగం చేసేవాళ్ళు ఇలా ఎన్నో విధాలుగా అకృత్యాలకు బలి అయిన స్త్రీలకు చావే పరిష్కారం కాదని, ఆత్మహత్యే శరణ్యం అంతకంటే కాదని, ధైర్యంతో స్థిరచిత్తంతో బ్రతకాలని నచ్చజెప్పి, ఓదార్పి ధైర్యాన్ని కలిగించి, ఆ తర్వాత వారి వారి సమస్యలను బట్టి దంపతులను కలపటం లేదా మనోవర్తి ఇప్పించటం, విడాకులు ఇప్పించటం, పునర్వికాసం కలిగించటం, బ్రతుకు తెరువు చూపించటం, అవివాహిత మాతలను సంస్కరించటం, అవసరమైతే హోమ్స్‌కు పంపడం, తగిన న్యాయ సలహాలందివ్వటం, మొదలైన అనేక రకాల సహాయాలను, సలహాలను అందించి వారికి పరిష్కార మార్గాల్ని చూపించడం ఈ కేంద్రం చేస్తున్నది.

ఈ ఉచిత కుటుంబ సలహా కేంద్రానికి గత సంవత్సరం నుండి కేంద్ర ప్రభుత్వ గుర్తింపు లభించింది.

చిరునామా:

మల్లాది సుబ్బమ్మ
డైరెక్టర్
ఫామిలీ కౌన్సిలింగ్ సెంటర్ & మేరేజ్ గైడెన్స్ బ్యూరో
9. ఎమ్.ఐ.జి.హెచ్
మెహిదీపట్నం
హైద్రాబాద్ - 500 028